క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



హైస్కూల్‌లో మొక్క నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్

గోపాలపట్నం: గోపలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మనబడి– మన వనం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల బాగు కోసం చేపడుతున్న పనులు మెచ్చుకోదగినవని కొనియాడారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ బాబూరావు, పూర్వ విద్యార్థులు పొన్నగంటి గోపాలకృష్ణ, అప్పలరాజు, ధవళ గోపాల్, పుష్పలత, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య రంగనాథ్ సేవలు చిరస్మరణీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: గ్రంథాలయ శాస్త్రానికి ఆచార్య ఎస్ ఆర్ రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన కృషి వల్లే గ్రంథాలయాలు క్రమ పద్ధతిలో నడుస్తున్నాయని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. రంగనాథన్ జయంతి సందర్భంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆయన మద్రాస్ యూనివర్సిటీలో గణితశాస్త్ర ఆచార్యుడిగా పని చేశారన్నారు. ప్రముఖ న్యాయవాది జి.కె.వి.రాజు, రచయిత సత్తిరాజులు ఆచార్య రంగనాథన్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్,కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న నిరాశ్రయుల కేంద్రం మేనేజర్

గోపాలపట్నం: ఓ వృద్ధురాలికి బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. 104 ఏరియా బస్‌స్టాప్ వద్ద నడవ లేని పరిస్థితిలో వృద్ధురాలు ఉందన్న సమాచారంతో వసతి గృహం మేనేజర్ ఎల్లేటి మమత ఎయిర్‌పోర్టు పోలీసుల సహకారంతో వెళ్లారు. వసతి గృహానికి తీసుకు వచ్చి సపర్యలు చేసి ఆమె ఆకలి తీర్చారు. ఇప్పటి వరకు ఈ వసతి గృహంలో పురుషులు మాత్రమే ఉండే వారు. ఇక నుంచిపై అంతస్తులో పురుషులు, కింద అంతస్తులో మహిళలు ఉంచేందుకు మేనేజర్ మమత ప్రయత్నాలు చేస్తున్నారు.

మురళికి ఎమ్మెల్యే అభినందన

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన ఉరుకూటి మురళీయాదవ్ షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ అధ్యక్ష పదవి వరించింది.ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే పి.గణబాబు,జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు యాదవ్,తదితరులు మురళీయాదవ్‌తో పాటు కార్యదర్శిగా ఎన్నికైన రాము,వెల్ఫేర్ సెక్రటరీగా ఎన్నికైన ఇంజరపు కూర్మారావులను అభినందించారు.

చెంతనే కార్పొరేట్ వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయి. వైద్యం కోసం పేదలు ఇబ్బంది పడకూడదన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైద్యం వ్యాపారమైన వేళ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి, స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలయాలతో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సేవలు బాగున్నాయంటూ ప్రశంసల జల్లు కురుస్తోంది.

- డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు
- స్పెషలిస్ట్‌ల నియామకంతో రోగుల తాకిడి
- ఆస్పత్రిలో చికిత్స, వసతులపై రోగుల హర్షం



40వ వార్డులో నిర్మించిన నూతన యూపీహెచ్‌సీ

రోజువారీ వైద్యసేవల వివరాలు

సోమవారం	: జనరల్ ఫిజీషియన్, పిల్లల వైద్య నిపుణులు
మంగళవారం	: జనరల్ ఫిజీషియన్, ఎముకల వైద్య నిపుణులు
బుధవారం	: జనరల్ ఫిజీషియన్
గురువారం	: జనరల్ ఫిజీషియన్, శ్వాసకోశ వ్యాధి నిపుణులు
శుక్రవారం	: జనరల్ ఫిజీషియన్
శనివారం	: జనరల్ ఫిజీషియన్, స్త్రీల సంబంధిత వ్యాధి నిపుణులు
ఆదివారం	: సెలవు

సింధియా: ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వేలల్లో బిల్లులు వేసే ప్రైవేట్ ఆస్పత్రుల గడప తొక్కాలంటేనే భయపడుతున్న పేద, మధ్యతరగతి వారికి యూపీహెచ్‌సీలు భరోసానిస్తున్నాయి. జీవీఎంసీ 40వ వార్డులో రూ.96 లక్షలతో యూపీహెచ్‌సీ నిర్మించారు. వైద్య సిబ్బంది గదులతో పాటు రోగుల వార్డులు, ఇతర గదుల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పించారు. రోజూ 80 మందికి పైగా రోగులు వైద్యసేవల కోసం వస్తున్నారు. ఇక్కడే తమకు కావాల్సిన వైద్య పరీక్షలు, చికిత్స చేయించుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. పంటి నొప్పి వచ్చినా, కంటి సమస్యలున్నా ఇక్కడే వాటికి చికిత్స చేస్తున్నారు. వైద్య నిపుణులు వచ్చిన రోజు ఓపీ సంఖ్య 90 నుంచి 110 మంది రోగులు వస్తున్నారు. ఆరోగ్య శ్రీ పరీక్షలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఉచితంగానే రక్త పరీక్షలు చేస్తున్నారు. మందులు అందజేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాధారణ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక వైద్య నిపుణులు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యసేవలు అందిస్తారు.

నాడు దూరా భారం.

ఒక్కప్పుడు ఆస్పత్రి లేక వైద్యసేవల కోసం ఏకేసీ కాలనీ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. కానీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టడంతో ప్రజలు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

మరిన్ని వసతుల కల్పనకు ప్రతిపాదనలు

ఏకేసీకాలనీ యూపీహెచ్‌సీకి మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. దీనిపై పశ్చిమ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రసుత్తం ఉన్న 10 పడకల ఆస్పత్రి స్థాయి పెంచే యోచనలో ఉన్నారు. అంబులెన్స్, ప్రసూతి విభాగం, ల్యాబ్, రోగులకు ప్రత్యేక గదులతో పాటు మరిన్ని సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.



యూపీహెచ్‌సీలోని మందులు ఇచ్చే గది

ఇబ్బందులు తొలగాయి



గతంలో ఎకేసీకాలనీలో ఆస్పత్రి లేక దూరప్రాంతాలకు వెళ్లేవాళ్లం.ఉదయం బయలుదేరి వెళ్లేసరికి ఓపీ సమయం అయిపోయేది. దీంతో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లేవాళ్లం. ఏకేసీ కాలనీలో కొత్తగా యూపీహెచ్‌సీ నిర్మించడంతో మా ప్రాంత వారికి మంచి వైద్య సేవలు అందుతున్నాయి. సాఫీగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్తున్నాం. – సిరిపాల మహాలక్ష్మి, ఏకేసీకాలనీ

మెరుగైన వైద్యం



ఏకేసీకాలనీలోని యూపీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. కొత్తగా నిర్మించిన భవనంలో సకల సదుపాయాలు ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తాం.

– గుండపు నాగేశ్వరరావు, వార్డు కార్పొరేటర్

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



పార్టీలో చేరిన వారితో ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

మల్కాపురం: పార్టీని నమ్ముకుని పని చేసిన ప్రతి కార్యకర్తకు తప్పక మంచి గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మనమంతా ఒకే ఆశయం, లక్ష్యంతో శ్రమించి వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ,వాయుపుత్రకాలనీ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధ్యక్షతన, 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన టీడీపీ కీలక నాయకులు విశ్వనాథ్‌రెడ్డి (బుల్లి),మడక రమణ,నర్సింగరావు తదితరులకు ఆడారి ఆనంద్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి,సంక్షేమాన్ని చూసిన పలు పార్టీల నాయకులు,కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టీడీపీ పాలనలో పేదల పరిస్థితి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పేదల పరిస్థితిని చూస్తే తేడా తెలుస్తుందన్నారు. చంద్రబాబు మాదిరిగా మాటలు చెప్పే మనిషి జగన్ కాదని, మాట ఇచ్చాడంటే నెరవేర్చే తత్వం గల నాయకుడు అని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే, పశ్చిమ నియోజక వర్గ పరిశీలకుడు డాక్టర్ ఎస్ఏ రెహమాన్ మాట్లాడుతూ టీడీపీలో చంద్రబాబును దగ్గర నుంచి చూసిన వారిలో తాను ఒక్కడినని , అతని అవసరం తీరాక కరివేపాకులా విసిరిపారేసే తత్వం చంద్రబాబుది అని విమర్శించారు. నమ్మిన వారి కోసం న్యాయం చేసే గుణం జగన్‌ది అని కొనియాడారు. టీడీపీ మునిగిపోయే నావ అని అందులో ప్రయాణం ప్రమాదకరమన్నారు. జేసీఎస్ జోనల్ ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు కొంత సమయం మాత్రమే ఉందని, ఆయా వార్డు కార్యకర్తలు,గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు శ్రమించి ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి వారి సంక్షేమానికి మన ప్రభుత్వం ఏమి చేస్తుందో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్లా కృష్ణ, పలు వార్డుల కార్పొరేటర్లు పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్,బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధ,ముర్రి వాణి,గుండపు నాగేశ్వరరావు,మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,నాయకులు మళ్ల ధనలత,అంగ రామ్‌ప్రసాద్,గులిగిందల కృష్ణ,నరేష్,శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

తాటి విత్తులు నాటిన జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: పర్యావరణానికి మేలు కలిగించే తాటి విత్తులను మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ ప్రాంతంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు, గ్లోబల్ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు సంయుక్తంగా నాటారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ సభ్యుడు సాలాది శ్రీరామకృష్ణయ్య మాట్లాడుతూ పర్యావరణానికి, మానవ మనుగడకు ఉపయోగపడే తాటి చెట్లు అంతరించిపోతున్నాయన్నారు. వాటిని పునరుద్ధరించేందుకు తాటి టెంకలు సేకరించి నాటామన్నారు. వీటిని పినగాడి వద్ద సంకల్ప కళాగ్రామం నుంచి సేకరించామని పేర్కొన్నారు. గతంలో సింహాచలం, మాదవధార , నరవ కొండ ప్రాంతాల్లో నాటామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సరీస్ అధ్యక్షుడు ఆకుల చలపతిరావు, సేవ్ టెంపుల్స్ ప్రతినిధి పిన్నమనేని శ్రీనివాసరావు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



తాటి టెంకల్ని సేకరించిన జేడీ ఫౌండేషన్ గ్లోబల్ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత రామునాయుడు, మంత్రి మోహన్, ఢిల్లీశ్వరరావు, శివల జ్ఞాపకార్థం ధరిమిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో ఆదివారం నిర్వహించిన విండ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, మల్కాపురం సీఐ జి.దేముడు బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడల వల్ల శారీరక శక్తితో పాటు మానసిక ఉల్లాసం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మజ్జి మాలినాయుడు, పూడి పైడిరాజు, దుర్గానగర్ గ్రామ కమిటీ సభ్యులు, దుర్గానగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులతో కార్పొరేటర్ లక్ష్మణరావు, సీఐ దేముడుబాబు

జాతీయ పతాకాలతో బీజేపీ శ్రేణుల ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు ఆదివారం గోపాలపట్నం బంక్ నుంచి కంచరపాలెం వరకు జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాశీ విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశ భక్తిని కలిగించేందుకు ఈ ర్యాలీ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో భరత మాత వేషధారణలో జాతీయ జెండా పట్టుకున్న బాలిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సీహెచ్ మంజుల, నాదెండ్ల జ్యోతి, గొట్టివాడ వెంకటేశ్వరరావు, ఆడారి గణేష్, సురేష్, కృష్ణారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

- దేవమాత ప్రధాన ఉత్సవానికి ఏర్పాట్లు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో నవదిన ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్లీవ్ గుర్తువీధిలో దేవమాత ఆలయం వద్ద జపమాల, దివ్య పూజాబలులు నిర్వహించారు. సాయంత్రం మేళ తాళాలతో దేవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీవ్ గుర్తువీధి, రే బరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. ఆగస్టు 15న దేవమాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో సుమారు రూ. 50 వేల వ్యయంతో ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు వై.అమర్‌దీప్, ఆదిరెడ్డి చార్లీ, పి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



నవదిన ప్రార్థనలో క్రైసవులు

అవయవదానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయనదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.



ఎర్నిమాంబ అమ్మవారు

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- కాకరలోవలో ఓటరు సర్వే పరిశీలన

సింధియా: ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఆదివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాకరలోవ 171 పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న ఓటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 17 ఏళ్లు నిండినవారు ముందస్తు నమోదులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అర్హులైన నూతన ఓటర్లను గుర్తించాలన్నారు. ఫాం–6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫాం–6(బి), ఫాం–7, ఫాం–8 ద్వారా ఓటర్ల జాబితా వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఏకేసీకాలనీ–2 సచివాలయాన్ని సందర్శించి 171,157, 163,159 పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. నిబంధనల మేరకు ఓటర్ల మార్పులు, చేర్పులు సవరించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, బూత్‌స్థాయి అధికారులు ఉన్నారు.



ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేష హారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగంలో భాగంగా ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుర్తాళ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ వేద మంత్రాలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అష్టలక్ష్మీ అమ్మవార్లకు హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చిందన్నారు. అధిక మాసంలో పూజ, జప, హోమాలూ చేస్తే అధికమైన సత్ఫలితాలు వస్తాయని శ్రీమహావిష్ణువు అధిక మాస ప్రాశస్త్యంలో చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



హారతి సమర్పిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, మాతా రమ్యానంద భారతి

కార్పొరేట్ వర్గాలకు కేంద్రం పెద్దపీట

సీతంపేట: కార్మిక ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ వర్గాలకు మోదీ పెద్దపీట వేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శించారు. రామాటాకీస్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభ ముగింపు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గించడం, విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం వంటి నిర్ణయాల వల్ల దేశం ఆర్థికంగా దివాళా తీస్తోందని విమర్శించారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టీల్‌ప్లాంట్ ఒక్కటని, దానిని కూడా నష్టాల సాకుతో ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చివేసిందన్నారు.

'ఉక్కు' ఉద్యమం ఆగదు



దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకుని ఆ అంశానికి స్వస్తి పలికే వరకు కార్మికులు చేస్తున్న ఉద్యమాలు ఆగవని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం నాటికి 913వ రోజుకు చేరుకున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో హెచ్ఎంఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. ఇలాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు.